క్లుప్తంగా

ఆరోగ్య రక్షణపై దృష్టి



వైద్య శిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రజలు వ్యక్తిగత ఆరోగ్య రక్షణపై దృష్టి సారించాలని డాక్టర్ సాయిచంద్ర అన్నారు. మండలంలోని గోపాలపురం షిర్డీ సాయి మందిరంలో పాలకొండకు చెందిన విజయ నెట్‌వర్క్ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న 185 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు కషాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ జె.సౌజన్య సూచించారు. మండలంలోని కుంబిడి – ఇచ్చాపురం గ్రామ పంచాయతీలో శనివారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సాగుకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు చేశారు. జీవ, ఘనామృతాలతో చీడపీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



పూజలందుకుంటున్న ఆయుధాలు

భామిని: మండల కేంద్రానికి చెందిన గిరిజన దొరలు కీర్తిరాయి వంశస్తులు దసరా వేడుకల్లో భాగంగా శనివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహిచారు. దొరల కుటుంబ సభ్యులు ఆయుధాలను చేతబూని సమీప వంశధార నదిలో శుభ్రపరిచి, అనంతరం పసుపు, కుంకుమలతో అలంకరించి తమ పురాతన గృహానికి తీసుకువచ్చి పూజలు చేశారు.

నానో యూరియాపై అవగాహన



మండల కేంద్రంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది, సైంటిస్టులు

సీతంపేట: నానో యూరియా వినియోగంపై వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి నానో యూరియా వేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. అలాగే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త పి. వెంకటరావు, మృత్తికా శాస్త్రవేత్త సౌజన్య, కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త విహారి, ఏడీఏలు సత్యవతి, రత్నకుమారి, శారద, వ్యవసాయాధికారి వై.వాహిని, తదితరులు

వీధి దీపాల ఏర్పాటు



వంశధార నది వరకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు

భామిని: మండలంలోని పసుకుడి గ్రామం నుంచి నాగావళి నది వరకు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కార్తీక పవిత్ర స్నానాల కోసం వంశధార నది వరకు సర్పంచ్ భార్గవ నాయుడు వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

సన్మానం

సీతంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.అడ్డయ్యకు రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి వచ్చిన సందర్భంగా పులిపుట్టి భారతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సామాజిక కార్యకర్త ఎస్పీ పెంటయ్య ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. కార్యక్రమంలో పాలకొండ ఎస్టీఓ భాస్కరరావు, డిప్యూటీ డీఈ అనంతర్‌రామ్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే మాలతమ్మ..

- నేరేడువలసలో వెలిసిన అమ్మవారు
- విజయదశమికి ప్రత్యేక పూజలు
- బందోబస్తు ఏర్పాటు చేయనున్న పోలీసులు

కురుపాం:

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం – గుమ్మలక్ష్మీపురం మన్య ప్రాంతానికి ముఖ ద్వారంలా ఉండే నేరేడువలసలో వెలిసిన మాలతమ్మ తల్లి భక్తుల కొంగు బంగారంగా, గిరిజన ప్రజల ఆరాధ్యదైవంగా కొన్ని దశాబ్దాలుగా పూజలందుకుంటోంది. గిరిజనులు తమ దైనందిన జీవితంలో ప్రతి శుభకార్యానికి ముందుగా మాలతమ్మ అమ్మవారుకి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే మైదాన ప్రాంతాల నుంచి కూడా ప్రతి ఆదివారం, మంగళ, బుధవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మను దర్శించుకుంటారు. ఒడిశాలోని పలు ప్రాంతాల ప్రజలు కూడా మాలతమ్మను ఇష్టదైవంగా కొలుస్తుంటారు.

ప్రమాదాలు జరగవు..

సుమారు యాభై సంవత్సరాల కిందట ఏజెన్సీ ప్రాంతాలకు సరైన రహదారి సౌకర్యం ఉండేది కాదు. అయితే నేరేడుకొండ (నేరేడువలస) ప్రాంతంలో మాత్రం తరచూ వాహన ప్రమాదాలు జరిగేవి. సరైన కారణాల్లేకుండానే ప్రమాదాలు జరుగుతుండడంపై గిరిజనుల్లో ఆందోళన నెలకొంది. ఈ సమయంలో నేరేడువలస గ్రామానికి చెందిన గిరిజనుడు సింగిన్నకు అమ్మవారు కలలో కనిపించి నేరేడు కొండ రహదారి పక్కన తాను వెలిశానని.. తన పేరు మాలతమ్మని.. తనను పూజిస్తే ప్రమాదాలు జరగవని చెప్పింది. మరుసటి రోజున నేరేడువలస గిరిజన ప్రజలంతా ఆ స్థలానికి వెళ్లి చూడగా అమ్మవారు రాయి రూపంలో దర్శనమిచ్చినట్లు ఓ కథనం ప్రచారంలో ఉంది. అప్పటినుంచి మాలతమ్మకు సింగన్న కుటుంబ సభ్యులే ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ ప్రాంతంలో ఒక్క ప్రమాదం కూడా జరగకపోవడం విశేషం.



పూజలందుకుంటున్న అమ్మవారు



దసరా నేపథ్యంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు



మాలతమ్మ ఆలయం

అంచెలంచెలుగా అభివృద్ధి..

కురుపాం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాలతమ్మ ఆలయాన్ని స్థానిక వర్తకులు, భక్తులు కమిటీగా ఏర్పడి అభివృద్ధి చేసుకుంటున్నారు. ప్రతి ఏడాదీ విజయదశమికి వేల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక పూజల్లో పార్వతీపురం, వీరఘట్టాం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, గుణుపూర్, ప్రాంతాలకు చెందిన భక్తులు ఎక్కువగా వస్తుంటారు.

కోర్కెలు నెరవేరుతాయి..



ఎంతో మహిమ కలిగిన మాలతమ్మను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయి. ఇక్కడి ప్రజలకు అమ్మవారంటే ఎంతో ప్రీతి. ప్రతి దసరాకు ప్రత్యేక పూజలు చేస్తాం. అలాగే వాహనాలు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా అమ్మను దర్శించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. దసరా రోజున భారీగా భక్తులు వస్తారు.

– పువ్వల రాము, ఆలయ అర్చకుడు, నేరేడువలస

ఏర్పాట్లు చేస్తున్నాం..



ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో విజయదశమికి భక్తులు వచ్చే అవకాశం ఉంది. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల ఏర్పాటు, ఇతర వసతులు కల్పిస్తున్నాం. భక్తులు క్రమశిక్షణతో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవాలి.

– తిమ్మక కోటేశ్వరరావు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు, గొటివాడ గ్రామం

బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం..

విజయదశమి రోజున ఎక్కువ మంది భక్తుల తో రద్దీ పెరిగే అవకాశం ఉంది కనుక వాహనాలను ఆలయానికి రెండు కిలోమీటర్ల ముందే నిలిపేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు చేపడుతున్నాం. భక్తులు సహకరించాలి.

– పి.నారాయణరావు, ఎస్సై, కురుపాం

దసరా రోజున సుమారు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుందంటే భక్తుల రద్దీ ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నప్పటికీ.. ఐటీడీఏ అధికారులు అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు.

బాలయ్య ఓ సైకో..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- జగన్ మోహన్‌రెడ్డి పేరు ప్రస్తావించే అర్హత కూడా బాలకృష్ణకు లేదు
- చిరంజీవిపై వ్యాఖ్యలు దుర్మార్గం
- డిప్యూటీ సీఎం పవన్ స్పందించకపోవడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: పవిత్రమైన అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సైకోలా ప్రవరించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే విశ్వారాయి కళావతి అన్నారు. శనివారం ఆమె వండువలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉంటూ హుందాగా మాట్లాడాల్సిన బాలకృష్ణ తూలుతూ నోటికొచ్చినట్లు మాట్లాడం సరికాదన్నారు. చిత్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై సినీ పెద్దలైన చిరంజీవి గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో జరిపిన చర్చల గురించి కామినేని శ్రీనివాస్ ప్రస్తావించగా.. బాలయ్య కలిపించుకుని అవాకులు, చవాకులు పేలడం పద్ధతి కాదని హితవు పలికారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో చర్చలు జరిపిన చిరంజీవిని ఉద్దేశించి వాడు, వీడు అని బాలయ్య పిచ్చి ప్రేలాపనలు వాగినా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా మారిన పవన్ తన అన్నను అవమానించినా తుడిచికుని వెళ్లిపోయేలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. చివరకు చిరంజీవి స్పందించి ఆనాడు చర్చల్లో పాల్గొనేందుకు బాలయ్య కోసం ఎన్నిసార్లు ప్రయత్నించారో, తర్వాత చర్చలు మంచి వాతావరణంలో జరిగిన తీరును లేఖ ద్వారా తెలియజేవారన్నారు. బాలకృష్ణ మానసిక స్థితి సరిగా లేదని, ఆయన్ను వెంటనే ఎర్రగెడ్డ మెంటల్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఆమెతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వండువ సర్పంచ్ మిడితాన కల్యాణి , తదితరులు ఉన్నారు.

బాలకృష్ణవి దిగజారుడు వ్యాఖ్యలు



దాసరి మాధవనాయుడు

గరుగుబిల్లి: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శాసనసభలో మెగాస్టార్ చిరంజీవితో పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై గురువారం చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ప్రచారకమిటీ రాష్ట్ర విభాగం కార్యదర్శి దాసరి మాధవనాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సభలో లేని వ్యక్తులపై పరుష పదజాలం ఉపయోగించడం సరికాదన్నారు. సినీ ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా ఉన్న చిరంజీవి గురించి వాడు, వీడు అని మాట్లాడటం చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితి ఏమిటో అర్థం అవుతోందన్నారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి



గోరిశెట్టి గిరిబాబు

గుమ్మలక్ష్మీపురం: అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవిపై అసందర్భ ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో బాలకృష్ణ ప్రవర్తన, చేసిన వ్యాఖ్యలు చూస్తే కనీస విజ్ఞత లేదన్న విషయం అర్థమవుతోందన్నారు. బసవతారకం హాస్పిటల్‌కు పెండింగ్ బిల్లులను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెల్లించారని.. బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎటువంటి రాజకీయం చేయకుండా బాలకృష్ణను కాపాడారని, బాలకృష్ణ సినిమాలకు టికెట్లు పెంచేందుకు కూడా అనుమతించారన్న విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రజా సమస్యలపై స్పందించరా..?

- ప్రశ్నించిన పాలకవర్గ సభ్యులు



పాలకవర్గ సమావేశంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న సభ్యులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యలపై అధికారులు స్పందించడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. నగరపంచాయతీ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా సభ్యులు పలు ప్రశ్నలు వేశారు. విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని సభ్యులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. గత సమావేశంలో చేసిన తీర్మానాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత అజెండా అస్తవ్యస్తంగా ఉందని, దీనిని తీర్మానించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ నగర పంచాయతీ సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు ఉందని.. దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. దీనిపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆధిపత్య పోరు అని కమిషనర్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. సిబ్బందితో సక్రమంగా పని చేయించాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉందన్నారు. వచ్చే సమావేశం నాటికి అన్ని సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రత్నంరాజు తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ఒరిగిపోయిన బస్సు

సీతంపేట: అంటికొండ గ్రామం నుంచి పాలకొండ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సుకు శనివారం తృటిలో ప్రమాదం తప్పింది. 12 మంది ప్రయాణికులతో వస్తుండగా మార్గమధ్యలో తుంబకొండ నుంచి గుమ్మడ ఘాట్ రోడ్డు దిగుతుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు పక్కనున్న గొయ్యిలోకి దిగిపోయింది. డ్రైవర్ మండల వెంకటరమణ చాకచక్యంతో బస్సును నిలిపివేయడంతో ఎటువంటి ప్రమా దం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాచిపెంట: ఈనెల 29వ తేదీన ఎంపీపీ బి.ప్రమీల అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీజే పాత్రో శనివారం తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు సంక్షిప్త సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యకుమారి

సీతంపేట: దసరా సెలవులకు ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి అన్నారు. ఆదివారం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో కళాశాల ఆవరణలో విద్యార్థినుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామానికి సమీపంలో ఉన్న గెడ్డలు, చెరువుల్లోకి స్నానాలకు పంపించవద్దన్నారు. అలాగే ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాల పునఃప్రారంభం వచ్చేనెల 6వ తేదీ నాటికి విద్యార్థినులకు కళాశాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



అంజలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల మృతి చెందిన విద్యార్థిని పువ్వల అంజలి కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాల నాయకులు బిడ్డిక అనిల్, మండంగి శ్రీనివాసరావు, పూల తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కంబగూడ గ్రామానికి శనివారం వెళ్లి అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం చేపడతానని చెప్పిన గిరిజన శాఖా మంత్రి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఏఎన్ఎంలు అందుబాటులో లేకపోవడం వల్లే విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని కోరారు.

న్యాయసేవలు అందించేలా చర్యలు

- న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



రిమాండ్ ఖైదీల నుంచి వివరాలు సేకరిస్తున్న న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

పాలకొండ రూరల్: వివిధ నేరాలకు సంబంధించి రిమాండ్ ఖైదీలుగా ఉంటున్న వారికి న్యాయ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా మూడో అదనపు న్యాయమూర్తి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. న్యాయవాదులును ఏర్పాటు చేసుకునే అవకాశం లేకుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకరిస్తామన్నారు. ఖైదీల ఆరోగ్య భద్రత, రక్షణ, జైల్ గదులు, పరిసరాలు, రికార్డుల నిర్వహణపై జైల్ సూపరింటిండెంట్ బి.జోగులుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి కె.హరిబాబు, హెడ్ వార్డర్స్ రమణయ్య, బి.విజయ్‌కుమార్, నాగరాజు, హేమసుందర్, సత్యారావు, లక్ష్మణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లికి భక్తుల తాకిడి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుప్రభాతసేవ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల దర్శనభాగ్యం భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తలనీలాలను సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

అక్టోబర్ 2 నుంచి పవిత్రోత్సవాలు

తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 2 నుంచి 5వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వీవీ.సూర్యనారాయణ తెలిపారు. చివరి రోజు స్వామివారికి నాగావళి నదిలో చక్రస్నానం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దర్యాప్తు నివేదిక విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పట్టణ ప్రజలకు ప్రాణాధారమైన దేవునిబంద, కామయ్య బంద, వరహాలగెడ్డ, నెల్లిచెరువులు కబ్జాకు గురయ్యాయని ఇటీవల ప్రభుత్వం వాటిపై చేపట్టిన దర్యాప్తు నివేదికను వెంటనే విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, జిల్లా కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, లక్ష్మనాయుడులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మే 21న అప్పటి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు. డీఆర్‌ఓ కె.హేమలత సమక్షంలో జరిగిన దర్యాప్తులో 24 మంది కబ్జాదారులకు నోటీసులు జారీ చేశామని ప్రభుత్వం లేఖ ఇచ్చింది కానీ ఆ తరువాత నివేదికలో ఎలాంటి చర్యలు లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. కబ్జాదారులు అధికార రాజకీయ అండతో స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మినీ గోకులాల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో తిరుపతిరావు, నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



వీరఘట్టం: పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ



కురుపాం: ప్రత్యేక అలంకరణలో కురుపాం కోటదుర్గ



పాలకొండ రూరల్: నక్కలపేట షిర్డీసాయి ఆలయంలో లలిత త్రిపుర సుందరిగా దర్శమిస్తున్న దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా దుర్గమ్మ మంటపాలు వెలిశాయి. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పలుచోట్ల సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



భామిని: బత్తిలి లలితమ్మ గుడిలో సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు



కురుపాం: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



గుమ్మలక్ష్మీపురం: బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి